క్లుప్తంగా

'సుదర్శన్ మరణం లోటు'

ఖానాపూర్: సీపీఐ(మావోయిస్ట్ పార్టీ) కేంద్ర కమిటీ సభ్యులు కటకం సుదర్శన్(ఆనంద్) మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కార్మిక నాయకుడి నుంచి భారత విప్లవోద్యమానికి అంకితమై చివరి శ్వాస దాకా పని చేశారన్నారు. ఆదివాసీలు, పీడితులు, కార్మికులు రైతుల పక్షాన పోరాటాలు చేసి దండకారణ్యంలో అజ్ఞాత వీరుడిగా నిలిచాడన్నారు. తమ పార్టీ తరఫున కుటుంబానికి సంతాపం, విప్లవ జోహార్లు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

శివాజీ బాటలో నడవాలి



వేడుకలో పాల్గొన్న యువకులు

కుభీర్: ఛత్రపతి శివాజీ చూపిన బాటలో నేటి యువత నడవాలని పలువురు ఆరె మరాఠ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోడాపూర్‌లో ఆరెమరాఠా సంఘం ఆధ్వర్యంలో శివాజీ పట్టాభిషేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి.. వారి పోరాటం గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ ఆనంద్ పటేల్, మండల కోఆప్షన్ సభ్యుడు దత్తహరి తదితరులు ఉన్నారు.

మొక్కలు సంరక్షించాలి

కుంటాల: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ నర్సరీని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. హరితహారంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ ఆరు మొక్కలు అందిస్తామన్నారు. కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చెరువుల పండుగ

తానూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే చెరువు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 22 చెరువుల వద్ద పూజలు, బోనాలతో నైవేద్యం సమర్పించాలని కోరారు. ఏఈ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకొని పూజలు చేశారు. ఇందులో గ్రామస్తులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న రాజేందర్

మామడ: గర్భిణులు సాధారణ ప్రసవాలు చేసుకునేలా వైద్యసిబ్బంది ప్రోత్సహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సిజేరియన్‌తో కలిగే ఇబ్బందులను గర్భిణులకు వివరించాలని సూచించారు. ఎన్‌సీడీ పీఓ శ్రీనివాస్, వైద్యుడు అరుణ్, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనులు

కుభీర్: మండల కేంద్రంలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈవో విజయ్ దగ్గరుండి సిబ్బందితో మురికి కాలువలను, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. చెత్తను రోడ్లపై పడేయకుండా ఇంటి ముందుకు చెత్త బండి వచ్చినప్పుడు అందులో వేయాలని ఈవో సూచించారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

కుంటాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు చైర్మన్ గజ్జారాం పేర్కొన్నారు. ఏవో సోమలింగా రెడ్డి, మహేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోశెట్టి, సీఈవో నాగభూషణ్, రైతులు పాల్గొన్నారు.

భూమి పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని వివాదాస్పద భూమిని మంగళవారం భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ పరిశీలించారు. ఈ భూమి విషయమై లోకేశ్వరం పోలీసులను, గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ భూమి వద్ద ఎలాంటి పనులు చేపట్టవద్దని.. చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముధోల్ సీఐ వినోద్, లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ ఉన్నారు.

కొనలేం.. తినలేం..



నిర్మల్ మార్కెట్‌లో కూరగాయలు

కూరగాయలు(రకం)	ధర(కిలోకు)
వంకాయ	రూ.70
బెండకాయ	రూ. 70
బీరకాయ	రూ. 70
టమాటా	రూ.40
పచ్చిమిర్చి	రూ.80
బీట్‌రూట్	రూ.80
క్యారెట్	రూ.80
మునగ కాయలు	రూ.100
కొత్తిమీర	రూ.80
ఉల్లిగడ్డలు	రూ.25
వెల్లుల్లి	రూ.120
అల్లం	రూ.220
నిమ్మకాయలు(4)	రూ.20

- మండుతున్న కూరగాయల ధరలు
- బెంబేలెత్తుతున్న సామాన్యులు
- వేసవిలో దిగుబడి తగ్గడమే కారణం

నిర్మల్‌ఖిల్లా: వేసవి ఎండలతోపాటు కూరగాయలు, చికెన్, మటన్, నిత్యావసరాల ధరలు సైతం మండిపోతున్నాయి. కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి లేకుండా పోతోంది. భగ్గుమంటున్న ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. అసలే వేసవి కాలం దీనికి తోడు కూరగాయల దిగుబడి తక్కువగా ఉండడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బెండకాయ, టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు, వంకాయ, దొండకాయ, ఇలా ఒకటేమిటి కిలో రూ.50కి పైగానే ఉంది. తక్కువ ధరకు లభించే ఆకు కూరలు కూడా మండిపోతున్నాయి. కొత్తిమీర అయితే కిలోకి రూ.80 పలుకుతోంది. వేసవికాలంలోపాటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో కూరగాయలకు భారీ డిమాండ్ ఏర్పడింది.

జిల్లాలో సాగవుతున్న దానికి మించిన డిమాండ్..

జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కూరగాయలు సాగుతున్నా ఇవి జిల్లా అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్, చుట్టుపక్కనగల మండలాల్లోని వారసంతలకు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తెచ్చి అమ్ముతున్నారు. సాగు గణనీయంగా తగ్గిపోవడం ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేసుకోవాల్సి రావడంతో కూరగాయల ధరలు మండిపోతున్నాయి.

మాంసం ధరలు సైతం..

కూరగాయలతోపాటు మాంసం ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. జిల్లాకేంద్రంలో ప్రస్తుతం కిలో మటన్ ధర రూ.700 ఉండగా, చికెన్ ధర రూ.240 ఉంది. చేపల మార్కెట్లో వివిధ చేపరకాలను బట్టి కిలోకురూ.200 నుంచి 600 ధర పలుకుతోంది.

ఏం కొనేటట్టు లేదు..

కూరగాయల ధరలు బాగా పెరిగాయి. కిలో రూ.40 ఉన్న బెండకాయ, బీరకాయ ఇప్పుడు రూ.80 చెపుతున్నారు. మాలాంటి మధ్యతరగతి కుటుంబాల వారికి చాలా కష్టం. అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నాం.

– రజిని, గృహిణి, నిర్మల్

దిగుబడి తగ్గడంతోనే..



నేను రోజు నిర్మల్ మార్కెట్లో ఉదయాన్నే టోకున కూరగాయలు కొని పగలంతా విక్రయిస్తుంటాను. అయితే డిమాండ్‌కి సరిపడా కూరగాయలు రావడం లేదు. దిగుబడి బాగా తగ్గింది. టోకు ధరలు కూడా పెరిగాయి. ధరలు ఎక్కువగా ఉండడంతో ఎక్కువగా కొనడం లేదు.

– అంగ శంకర్, కూరగాయల వ్యాపారి, నిర్మల్

కొనసాగుతున్న బడిబాట



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో మైసాజీ

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, కనకాపూర్, వడ్యాల్, పొట్టపెల్లి, లక్ష్మణచాంద వంటి గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ సర్కారు బడుల్లో అందుతున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

ముధోల్: నాణ్యమైన విద్య అందుతున్న సర్కారు బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని మండల విద్యాధికారి జి.మైసాజీ అన్నారు. మంగళవారం మండలంలోని ముద్గల్, మచ్కల్ గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ సర్కారు బడుల్లో అందుతున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే వసతులు వివరించారు. హెచ్‌ఎం అమృతం, ఉపాధ్యాయులు వెంకట్‌రావు, విఠల్‌రావు, వీరన్న, లక్ష్మీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: ఐదేళ్లు నిండిన చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయురాలు గీత అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్వి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల లోపున్న చిన్నారుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూవెల్మల్‌లో..

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి.. గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని సౌకర్యాలున్న సర్కారు బడులకే విద్యార్థులను పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోదావరి, అబ్దుల్, అలీం, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు ప్రమోద్, శ్రీనివాస్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం లబ్ధిదారులకు భోజనం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని రాజురా, చందునాయక్ తండా, దేశినాయక్ తండా, బావాపూర్(ఆర్) కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం బావాపూర్(ఆర్) కేంద్రం ఆవరణలో న్యూట్రిగార్డెన్‌లో విత్తనాలు నాటారు. వారి వెంట సూపర్‌వైజర్ శ్రీలత తదితరులు ఉన్నారు.

కూలీలకు అండగా ఉంటాం



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని బీజేపీ నాయకుడు నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్యాల్, బాబాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి పని ప్రదేశాల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎల్లమ్మ బోనాల పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పీచర ఎంపీటీసీ రాజేశ్వర్, లక్ష్మణచాంద ఎంపీటీసీ నర్సారెడ్డి, బీజేపీ నాయకులు అంజుకుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గోవర్ధన్, జీవన్‌రెడ్డి, భరత్, నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాజన్న

భైంసారూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర ఏడో మహాసభ పిలుపు మేరకు మంగళవారం మండలంలోని వానల్‌పాడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం నిరుద్యోగం పెంచిందన్నారు. రూ.ఐదు లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, రైతులకు రుణమాఫీ వంటి హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం ఉధృతం చేయాలని అన్ని వర్గాల ప్రజల్ని కోరారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్ష దివస్‌కు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, శంకర్, గంగుభాయ్, వసంత, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ..!

కార్డురకం	కార్డులు	లబ్ధిదారులు	బియ్యం కోటా (కిలోలు)
ఎఫ్ఎస్‌సీ	1,96,063	6,04,841	36,29,046
ఏఎఫ్ఎస్‌సీ	12,589	38,535	4,40,615
ఏఏపీ	33	33	330
మొత్తం	2,08,685	6,43,409	40,69,991



భైంసాటౌన్:జిల్లాలో నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. 22 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేసిన డీలర్లు ఈనెల 3 నుంచి సమ్మె చేపట్టారు. దీంతో వారంరోజులుగా రేషన్ బియ్యం పంపిణీ చేపట్టలేదు. లబ్ధిదారులు రేషన్ బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారోనని ఎదురుచూస్తున్నారు. కాగా, మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ డీలర్ల సంఘం నేతలతో చర్చించగా, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి 20 డిమాండ్లు వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడించారు.

ఎంఎల్ఎస్ పాయింట్లలోనే బియ్యం..

రేషన్ డీలర్లు సమ్మెకు దిగిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పలువురు డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం దించుకోలేదు. సమ్మెకు ముందు వరకు కొందరు బియ్యం సంచులు దించుకున్నా, పంపిణీ ప్రారంభించలేదు. బియ్యం నిరాకరించిన డీలర్లకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సరఫరాకు సమయం పడుతుంది. దీంతో కొన్నిచోట్ల రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం జరుగనుంది.

రోగులకు పండ్లు పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం భుక్య జాన్సన్‌నాయక్ యువసేన ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జాన్సన్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని సభ్యులు పండ్ల పంపిణీతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గాంధీనగర్ క్యాంపు కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. రమేష్, రాజశేఖర్, మజర్‌ఖాన్, అజార్, షఫీ, అజయ్, రాజు, సల్మాన్, ఫసీ, సంతోష్, గంగాసాగర్, శంకర్ ఉన్నారు.

ఆలయంలో పూజలు

ఖానాపూర్: పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకుడు కృష్ణంరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని గర్భగుడి స్లాబ్, గోపురం నిర్మాణానికి అయ్యే ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణంరాజును సన్మానించారు. శ్రీనివాస్, పంబాల భీమేశ్వర్, సతీశ్‌రావు, రవికాంత్, చంద్రహాస్, జనార్దన్, రాజేశ్వర్, నాగరాజు, రవి ఉన్నారు.

ప్రమాదకర స్తంభాలు తొలగించాలి

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ పరిధిలో ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించాలని వార్డు కౌన్సిలర్ ఫౌజియా, కాంగ్రెస్ మండల కార్యదర్శి షబ్బీర్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీలో ఇళ్ల మీదుగా 33 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుందన్నారు. సమస్య పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లెపల్లెకూ రేఖక్క'

- ఎమ్మెల్యే రేఖానాయక్



దస్తురాబాద్: మున్యాల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే పల్లెపల్లెకూ రేఖక్క కార్యక్రమం చేపట్టినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని మున్యాల, మున్యాల తండా, ఎర్రగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో రైతులకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. వారి వెంట ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎంపీవో అనిల్, రమేశ్‌రావ్, శ్రీనివాస్, శివయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో క్షీరాభిషేకం..

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్‌తో కలిసి ఎమ్మెల్యే రేఖానాయక్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్ మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ రూ.25కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ మినహా అధికార పార్టీ సహా ఇతర పార్టీల కౌన్సిలర్లు ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పలు సందర్భాల్లో కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ పనితీరుపై విమర్శలు చేశారు. మోహిద్, సుమన్, గౌర్రె గంగాధర్, కానూరి సతీశ్, కిశోర్, వెంకటప్పయ్య, కమిషనర్ మనోహర్ ఉన్నారు.

విత్తనాలు పంపిణీ..

కడెం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే రేఖానాయక్ రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరి, పెసర, మినుముల విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయని.. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ రఫీక్ అహ్మద్, ఏఎంసీ డైరెక్టర్ మంగ తదితరులు ఉన్నారు.

నేడు లక్కీ డ్రా

నిర్మల్‌చైన్‌గేట్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ 2023–24 విద్యా సంవత్సరానికి 3, 5, 8వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులను బుధవారం సాయంత్రం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు గిరిజన అభివృద్ధి అధికారి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే డ్రాకు విద్యార్థులు, తల్లి దండ్రులు హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ముధోల్: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి రూ.3లక్షలు, శివాజీ విగ్రహం కోసం రూ.2.50లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని మంగళవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆయా సంఘాల సభ్యులకు అందజేశారు. వారు కృతజ్ఞతలు తెలిపి ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సాగరబాయి రాజన్న, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, నారాయణ్‌రావు, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, కిషన్, ఆనంద్‌రావుపటేల్, విఠల్, బొర్రన్న, శంకర్, హన్మండ్లు, గిరి పటేల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

లోకేశ్వరం: మండలంలోని వట్టోలిలో గ్రామానికి చెందిన మాదరి కీర్తిని మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిర్మల్ సోఫీనగర్ బాలికల వసతిగృహంలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన కీర్తి 10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థికి కొంత ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు క్యాస్తు సుదర్శన్, అంబేద్కర్ సంఘం నాయకులు బాబన్న, వినోద్, మాదరి సాయన్న, సురేశ్, జనార్దన్, గంగన్న, ముత్తన్న, చిన్నసాయి, జగన్, రాజులు ఉన్నారు.

సర్కారు బడికే సై..!



నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు

కుంటాల: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కుంటాల మండలం పెంచికల్‌పాడ్ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధిహామీ పని ప్రదేశంలో పిల్లలను చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. నాలుగైదు సంవత్సరాల నుంచి పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. ఈసందర్భంగా తమ పిల్లలను సర్కారు బడికే పంపిస్తామని మరోమారు ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ భోజాబాయి, ఎస్ఎంసీ చైర్మన్ బాబారావు, హెచ్‌ఎం ఎల్లన్న, పంచాయతీ కార్యదర్శి సారిక, టీఏ మాదూరి, ఎఫ్ఏ గంగాధర్, పోషకులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'కు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నిర్మల్‌టౌన్: కొత్తగూడెంలో ఈనెల 11న నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విలాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో సభ గోడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. లక్ష మందితో సభ నిర్వహిస్తున్నామని.. జిల్లా నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఉపాలి, సాయి, రాథోడ్ పుండలిక్, సివిల్ సప్లయి హమాలీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ – వేలాడుతున్న ముప్పు



లోకేశ్వరం: మండలంలోని వట్టోలి నుంచి ధర్మోర వెళ్లే మార్గంలో రోడ్డుపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వట్టోలి సమీపంలోకి లారీలు రాగానే.. అందులో ఉండే పనివారు కిందకు దిగి విద్యుత్ తీగలను కట్టెతో పైకి లేపాల్సి వస్తుంది. ప్రమాదం జరగక ముందే విద్యుత్ తీగలను సరి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివకుమార్, విద్యుత్ ఏఈ, లోకేశ్వరం
ఫోన్: 94408 11710

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వధువు వివాహం శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899